# సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా..

## వైకాపా నాయకులకు ఎంఎస్ రాజు సవాల్

మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరరెడ్డి, నాయకులు పరిటాల శ్రీరామ్, నెట్టెం వెంకటేశ్

**రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల గురించి పట్టించుకోని ఆ పార్టీ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సుల్లో కొత్త నాటకాలు ఆడుతున్నారని శ్రీసత్యసాయి జిల్లా తెదేపా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విమర్శించారు. ఆయన బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలో బీసీల సభ నిర్వహిస్తే కనీసం 15 నిమిషాలు కూడా జనం కూర్చోలేదన్నారు. అందుకే పుట్టపర్తిలోని వారిళ్లలోనే వైకాపా నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభ సమయంలో సరైన అనుమతులు లేవన్నారు. గ్రీన్ ట్రైబ్యునల్ అనుమతులతో పాటు డీపీఆర్ లేకుండా ప్రాజెక్టు ప్రారంభించారన్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం కేసు వేయగా, 2022లో వైకాపా ప్రభుత్వ హయాంలోనే ఆగిపోయిందన్నారు. మూడేళ్లపాటు ఏం చేయలేని స్థితిలో ఉన్నారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు ఆగినట్లు దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. ఐదేళ్లలో ఎన్ని ప్రాజెక్టుల కోసం ఎంత ఖర్చు చేశారు? ఎన్ని టీఎంసీలు తెచ్చారు? ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇచ్చారో చర్చించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మీరు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన ప్రాంతానికైనా రావడానికి తాము సిద్ధమని, మీకు వచ్చే ధైర్యం ఉందా అని నిలదీశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రాజకీయంగా, ప్రభుత్వ పదవుల పరంగా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది ఒక్క తెదేపా అని గుర్తు చేశారు. వైకాపా హయాంలో ఒక సామాజిక వర్గానికే పదవులన్నీ ఇచ్చి, ఈరోజు 'బీసీ గళం' అంటే బీసీలే వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## జడ్పీ ఇన్‌ఛార్జి ఉప సీఈఓగా మల్లికార్జున

**తపోవనం (అనంత గ్రామీణం):** జిల్లా ప్రజాపరిషత్తు ఉప సీఈఓగా మల్లికార్జునకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఉప సీఈఓగా ఉన్న జి.వెంకటసుబ్బయ్య పులివెందుల డీడీఓగా బదిలీ అయినా విషయం తెలిసిందే. ఈ స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించకపోవడంతో ఏఓగా ఉన్న మల్లికార్జునకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు. గురువారం వెంకటసుబ్బయ్య రిలీవ్ కానున్నారు. పదోన్నతి పొంది ఇటీవల సీఈఓగా విజయలక్ష్మిని ఇక్కడికి బదిలీ చేసినా ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా రెండు మూడురోజుల్లో ఆమె బాధ్యతలు స్వీకరించి మళ్లీ సెలవు పెట్టనున్నారు. మే రెండో వారంలో పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

## రైల్వే అభివృద్ధికి సీఎం కృషి అపారం

మాట్లాడుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రధానకార్యదర్శి శంకర్రావు

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేల అభివృద్ధికి చాలా కృషి చేస్తున్నారని రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రధాన కార్యదర్శి, అఖిలభారత సహాయ కార్యదర్శి శంకర్రావు అన్నారు. ఆయన బుధవారం గుంతకల్లుకు వచ్చిన సందర్భంగా మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ జోన్ సాధనలో, కార్యాలయం ఏర్పాటుకు ముఖ్యమంత్రి చాలా పాటుపడ్డారని గుర్తు చేశారు. రైల్వేలైన్లను కొన్నింటిని సాధించుకున్నారన్నారు. రైల్వే ఉద్యోగుల కోసం జోనల్ కేంద్రమైన విశాఖలో కేంద్రీయ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తే ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడతారన్నారు. దీన్ని విజయవాడలో ఏర్పాటు చేసే విధంగా ముఖ్యమంత్రి శ్రద్ధచూపాలని కోరారు. అమృత్ పథకం కింద చిన్న స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారన్నారు. గుంతకల్లు లాంటి ప్రధాన స్టేషన్ల గురించి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి కొత్తరైళ్లను సాధించుకోవాల్సి ఉందని వివరించారు. జోనల్ కోశాధికారి సరోజిని, యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, అధ్యక్షుడు మస్తాన్‌బాషా, నాయకులు సుధాకర్, జాఫర్, బాషా, పెన్షనర్ల విభాగం కార్యదర్శి మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఎస్కేయూకు వేసవి సెలవులు

**ఎస్కేయూ:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి మే 1 నుంచి జూన్ 22వ తేదీ వరకూ వేసవి సెలవులు ప్రకటించారు. వీసీ జ్యోతికుమార్ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ అంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. వసతిగృహాల్లోని గదులను విద్యార్థులు ఖాళీ చేయాలని... 'లా' ఆఖరు సంవత్సరం, బీటెక్, ఫార్మసీ, బీఈడీ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో మే 15 వరకు వసతిగృహంలో భోజనం అందుబాటులో ఉంటుందన్నారు.


Bank of India
బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోన్, కార్పొరేట్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్, #31-23-1ఎ, పి.పి.ఆర్. కాంప్లెక్స్, 1వ అంతస్తు, BSNL భవన్ ప్రక్కన, చుట్టుగుంట, విజయవాడ, ఎ.పి.-520004, ఫోన్: 0866-2467762, e-mail: Vijayawada.csd@bankofindia.bank.in

**బ్యాంక్ ఆఫ్ ఇండియా, నారాయణపురం బ్రాంచి కొరకు నూతన ప్రాంగణము కావలెను**

బ్యాంక్ ఆఫ్ ఇండియా లీజు ప్రాతిపదికన నూతన ప్రాంగణం కోసం ఆఫర్లను ఆహ్వానిస్తున్నది. వివరణాత్మక నోటిఫికేషన్ మా వెబ్‌సైట్ www.bankofindia.bank.in లో అందుబాటులో ఉన్నది. అప్లికేషన్స్ సమర్పించడానికి చివరితేదీ 13.05.2026. ఏదైనా సవరణ / అనుబంధం / నోటిఫికేషన్ ఉంటే, అవి వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడతాయి.

సం/- జోనల్ మేనేజర్, విజయవాడ జోన్

Bank of India
బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోన్, కార్పొరేట్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్, #31-23-1ఎ, పి.పి.ఆర్. కాంప్లెక్స్, 1వ అంతస్తు, BSNL భవన్ ప్రక్కన, చుట్టుగుంట, విజయవాడ, ఎ.పి.-520004, ఫోన్: 0866-2467762, e-mail: Vijayawada.csd@bankofindia.bank.in

**బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిపత్రి బ్రాంచి కొరకు నూతన ప్రాంగణము కావలెను**

బ్యాంక్ ఆఫ్ ఇండియా లీజు ప్రాతిపదికన నూతన ప్రాంగణం కోసం ఆఫర్లను ఆహ్వానిస్తున్నది. వివరణాత్మక నోటిఫికేషన్ మా వెబ్‌సైట్ www.bankofindia.bank.in లో అందుబాటులో ఉన్నది. అప్లికేషన్స్ సమర్పించడానికి చివరితేదీ 13.05.2026. ఏదైనా సవరణ / అనుబంధం / నోటిఫికేషన్ ఉంటే, అవి వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడతాయి.

సం/- జోనల్ మేనేజర్, విజయవాడ జోన్

**ANANTAPURAMU MUNICIPAL CORPORATION**
**e-PROCUREMENT- TENDER NOTICE**

| | | |
|---|---|---|
| 1 | Tender Notice No. | 40-50/General Funds/2026-27/TO (General Funds) |
| 2 | Scope of Work | Providing of CC Roads and Drains and De-siltation of drains in atp |
| 3 | No. of Work | 28 No. |
| 4 | Estimate Cost | Rs. 2.10 to 17.00 Lakhs |

Note: The details of Tender may be seen on e-procurement market Place available @ https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner,
Municipal Corporation. Anantapuramu



EENADU Classifieds

AGRI BUSINESS

FOR SALE

**ఫారెస్ట్ డిపార్ట్మెంట్** నుండి అనుమతి పొందిన దాదాపు 200 చింత చెట్లు, వంట చెరుకు కోసం అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. సంప్ర: 79893 64351.

REAL ESTATE

**ల్యాండ్ పార్ట్‌నర్స్** (Land Partners) కావలెను. మీ భూమిలో అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వాణిజ్య ప్రాజెక్టులు నిర్మించు కోవాలనుకునే భూమి యజమానులు సంప్రదించగలరు. అభివృద్ధి చేయించుకొని లాభం పొందండి. ఆసక్తి గలవారు వెంటనే ఫోన్ చేయండి. సెల్: 9133399861

**హిందూపురంలో** అద్భుతంగా డెవలప్ చేసిన వెంచర్‌లో 38 లక్షలకే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మరియు ఓపెన్ ప్లాట్స్ కలవు. KVR Realty @ 6281824204

JOBS

**సోలార్ ప్రొడక్ట్స్** ఇన్‌స్టలేషన్ కొరకు టెక్నీషియన్స్/హెల్పర్స్ కావలెను. Q: ITI ఎలక్ట్రికల్, జీతం: 12-15 వేలు + TA, DA, 2 వీలర్ కంపల్సరీ. 9160353879.

**హైదరాబాద్‌లో** నలుగురు ఉన్న కుటుంబానికి ఇంటిపని, వంటపని చేయుటకు ఒక ఆడ మనిషి కావలెను. జీతం, భోజనం+వసతి. సెల్: 9347919770.

**అనంతపురం పట్టణంలో** PVK Groups సంస్థ నందు పనిచేయుటకు ఆసక్తి గల (Ladies) టెలికాలర్స్ కావలెను. జీతం 10,000. Call: 9398063479.

**అనంతపురం నగరంలో** క్లాత్స్ (Clothing) మరియు (Biscuit) వ్యాపారానికి మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఫీల్డ్‌వర్క్ చేయగలిగే అనుభవం ఉన్న సేల్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనుభవానికి అనుగుణంగా ఆకర్షణీయమైన జీతం అలాగే TA & DA సౌకర్యాలు కల్పించబడును. ఆసక్తి ఉన్న వారు సం(ప్ర) : 9133399861.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈ లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

విరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును


# నారీమణులం.. ఆర్థిక ప్రగతి వారధులం

స్వయం ఉపాధి దిశగా రాణింపు

కొందరు మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులేసి ఆర్థికంగా బలంగా నిలబడ్డారు. ఎవరికి వారు నచ్చిన రంగంలో ప్రత్యేకత చాటుకుంటూ కుటుంబ జీవనాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా నెట్టుకొస్తున్నారు. ఆ మహిళల విజయగాథపై స్ఫూర్తిదాయక కథనం.

### ఆలోచనతో కదిలారు

**గుంతకల్లు పట్టణం:** గుంతకల్లు మండలం బుగ్గసంగాల గ్రామంలో ఝాన్సీ పొదుపు సంఘంలో కె.వాణి ఎనిమిదేళ్లుగా సభ్యురాలిగా ఉంటున్నారు. గతంలో టైలరింగ్ మిషన్ తెచ్చుకుని జాకెట్లు కుట్టడం, మరో వైపు పొలంలో కూరగాయలు సాగు చేసుకునే వారు. ఎనిమిది నెలల క్రితం డ్వాక్రా సంఘం ద్వారా పీఎంఎఫ్‌ఎంఈ ద్వారా రూ.6 లక్షల రుణం, చేతి నుంచి మరో రెండు రూ.లక్షలతో ఆయిల్ మిషన్‌ను కొనుగోలు చేసి గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో గదిని అద్దెకు తీసుకుని ఏర్పాటు చేశారు. వేరుసెనగ, ఆముదం, కొబ్బరి నుంచి ఆయిల్ తీసి విక్రయిస్తున్నారు. నెలకు రూ.25వేలు వరకు ఆదాయం వస్తుందని వాణి చెబుతున్నారు.

నూనె తయారీ యంత్రాన్ని ఏర్పాటు చేసిన వాణి

### ఆత్మవిశ్వాసమే పెట్టుబడి..

డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్న లక్ష్మి

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** తాడిపత్రి గ్రామీణ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన లక్ష్మి తొమ్మిదో తరగతి వరకు చదువుకుంది. ఇటీవల ఓపెన్‌లో పదో తరగతి పూర్తి చేసింది. భర్త లక్ష్మీరంగయ్య ఓ ప్రైవేట్ ఉద్యోగి. లక్ష్మీ ఎప్పుడో నేర్చుకున్న ద్విచక్రవాహన డ్రైవింగ్ ఆమెకు ఉపాధి మార్గాన్ని చూపింది. భర్త సాయంతో స్కూటీ కొనుగోలు చేసి మహిళలకు డ్రైవింగ్ శిక్షణను ప్రారంభించింది. నెలకు రూ.40 వేలకు పైగానే సంపాదిస్తోంది. ఈమెతో పాటు మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తోంది. ఇప్పటి వరకు రెండు వేల మందికి పైగా శిక్షణ ఇచ్చింది. వీరిలో ఉద్యోగులు, గృహిణులు ఎక్కువగా ఉన్నారు. మున్ముందు కారు డ్రైవింగ్ శిక్షణను ప్రారంభిస్తానని, మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని లక్ష్మి ఆత్మవిశ్వాసంతో చెబుతోంది.

### దుస్తులకు సరికొత్త డిజైన్లు

**గుంతకల్లు:** గుంతకల్లు మండలంలోని బుగ్గసంగాలలోని లాలెమ్మ పొదుపు సంఘంలో లలిత సభ్యురాలిగా ఉన్నారు. మొదట్లో టైలరింగ్ మిషన్ తెచ్చుకుని దుస్తులను కుట్టడం ప్రారంభించారు. నాలుగేళ్ల కిందట సొంత పెట్టుబడి రూ.4లక్షలు ఖర్చు చేశారు. ఇటీవల మరో రూ.4.50లక్షల బ్యాంకు రుణంతో సూరత్ నుంచి రెండు ఎంబ్రాయిడరీ మిషన్లు తీసుకొచ్చారు. గుంతకల్లులో గదిని అద్దెకు తీసుకుని ఆధునిక పద్ధతుల్లో జాకెట్లు కుడుతూ నాలుగురాళ్లు వెనకేసుకుంటున్నారు. జాకెట్లకు ఎంబ్రాయిడరీ డిజైన్లు వేస్తుండటంతో మహిళల నుంచి ఆదరణ బాగా ఉంటోంది. ఒక్కో జాకెట్‌కు రూ.2 వేల వరకు తీసుకుంటున్నారు. తద్వారా నెలకు చెప్పుకోదగ్గ ఆదాయాన్ని గడిస్తుండటం విశేషం.

డిజైన్ల రూపకల్పనలో లలిత

# నిత్య సాధనతో విజయపతాక!

### కరాటే, పరుగు పోటీల్లో విద్యార్థుల సత్తా

కొందరు పిల్లలు బడి వయసులోనే ఆటల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఒక పక్క చదువు, మరో వైపు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ఆటతీరుతో అందర్నీ మెప్పించి పతకాలు కొల్లగొడుతున్నారు. నిత్యం మైదానంలో సాధన చేస్తూ విజయాల వైపు పరుగులు పెడుతుండటం విశేషం. విద్యార్థుల విజయాలపై స్ఫూర్తిదాయక కథనం.

- న్యూస్‌టుడే గుంతకల్లు, తాడిపత్రి

### అంతర్జాతీయ ట్రోఫీనే లక్ష్యంగా..

నవనీత్

గుంతకల్లులోని రైల్వే ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలకు చెందిన నవనీత్ కరాటే పోటీల్లో సత్తా చాటుతున్నాడు. ఇక్కడి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బాల్యం నుంచే కరాటే ఎంతో ఇష్టం. జిల్లా స్థాయి పోటీల్లో పలుసార్లు ప్రథమ స్థానంలో నిలిచాడు. నెల రోజుల కిందట కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రథమ బహుమతి అందుకోవడం విశేషం. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో రెండు నెలల కిందట జరిగిన జాతీయ పోటీల్లో ద్వితీయ స్థానంలో రాణించారు. తాజాగా గుంతకల్లులో జరిగిన రెండు అంతర్ జిల్లాల కరాటే పోటీల్లో ఛాంపియన్ షిప్‌ను సాధించడం విశేషం.

### విజయాల 'పరుగు'

అవంతిక

యాడికి మండలంలోని నగురూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు, జయమ్మల కుమార్తె అవంతిక. విద్యార్థిని తండ్రి కూలీ పనులకెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తెను తాడిపత్రిలోని కస్తూర్బా మైనార్టీ పాఠశాలలో చదివిస్తున్నాడు. పరుగు పందెం అంటే ఎంతో ఇష్టం. 200, 300 మీటర్ల పరుగు పోటీల్లో ప్రతిభ చాటుతోంది. తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని రాణించింది. ఇప్పటి వరకు విద్యార్థిని అన్ని విభాగాలకు సంబంధించి ఏడు పతకాలు సాధించడం విశేషం.

## బాధితులకు న్యాయం జరిగితేనే వ్యవస్థపై విశ్వాసం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

**అనంతపురం (మూడోరోడ్డు):** నిందితులకు శిక్షలు పడి బాధితులకు న్యాయం జరిగినప్పుడే న్యాయస్థానాలపై విశ్వాసం పెరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు అన్నారు. బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో బదిలీపై వెళుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తులు హరిత, సాదుబాబులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం జడ్జి సాదుబాబు తన పరిధిలోని కేసులను వేగవంతంగా పరిష్కారం చూపారన్నారు. కేసుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి హరిత కుటుంబ తగాదాల కేసులలో వేగవంతంగా పరిష్కారం చూపారన్నారు. ఈ రెండు కోర్టుల్లోనూ బాధితులకు సులభంగా న్యాయం అందేలా చూశారన్నారు. బదిలీపై వెళ్లే కోర్టుల్లో కూడా ఇదే ఉత్సాహంతో పని చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

## 'సీఎం సార్..అహమ్మద్ బాబు మాకొద్దు'


నిరసన తెలుపుతున్న ఉద్యోగుల సంఘం నాయకులు

**అనంతపురం (అరవిందనగర్), న్యూస్‌టుడే:** 'రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ అహమ్మద్ బాబు నుంచి వాణిజ్య పన్నుల శాఖను కాపాడండి. మేము ఉద్యోగులం. బానిసలం కాదు. ఆయన్ను తక్షణం ఈ శాఖ నుంచి పంపించాలని' ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సర్వీసుల సంఘం డివిజన్ అధ్యక్షుడు జ్యోతిరామ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ ప్రధాన కార్యాలయం ఆవరణలో బుధవారం రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ అహమ్మద్ బాబు ఉద్యోగులతో వ్యవహరిస్తున్న తీరుపై సంఘాల నాయకులు మండిపడ్డారు. జ్యోతిరామ్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలోని అరాచకమే నేటికీ కొనసాగుతోందని ఆరోపించారు. చట్టాలు, ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు ఏవీ అమలు కావడం లేదన్నారు. కూటమి సర్కారు ఆదేశాలంటే ఆయనకు లెక్కలేదని, కోర్టు ఉత్తర్వులకు దిక్కులేదని, ఉద్యోగులంటే గౌరవం లేదని వాపోయారు. నిరసనలో సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శులు శబరీష్, నగేశ్, కోశాధికారి వెంకటేశులు, మహిళా ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ పోటీల్లో ఆతిథ్య జట్ల విజయం

మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

**అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి శాప్ లీగ్ ఫుట్‌బాల్ పోటీల్లో అనంతపురం జట్లు అన్ని విభాగాల్లో విజయఢంకా మోగించాయి. బుధవారం అనంత క్రీడాగ్రామంలో పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్-21 విభాగంలో అనంత పురుషుల జట్టు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రత్యర్థులను చిత్తుగా ఓడించి ఫైనల్ దిశగా పరుగులు తీస్తున్నాయి. నాలుగు విభాగాల్లో అనంత జట్లు గెలిచాయి. అండర్-15 విభాగంలో అనంత, అన్నమయ్య, నెల్లూరు, శ్రీసత్యసాయి, తిరుపతి, ఏలూరు, పల్నాడు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, నెల్లూరు, కృష్ణా జట్లు ముందంజలో ఉన్నాయి. బాలికల విభాగంలో కర్నూలు, అనంతపురం, ఏలూరు, అన్నమయ్య జట్లు దూసుకుపోతున్నాయి. అండర్-21 పురుషుల విభాగంలో అనంతపురం, ఏఎస్ఆర్ జిల్లా, తిరుపతి, ఏలూరు, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం, శ్రీసత్యసాయి, గుంటూరు జట్లు గెలిచాయి. మహిళల విభాగంలో అనంత, విశాఖపట్టణం, కర్నూలు జట్లు ముందంజలో ఉన్నాయి. పోటీలను డీఎస్‌డీఓ మంజుల, ఇతర జిల్లాల ప్రత్యేక అధికారులు జగన్నాథరెడ్డి, సురేంద్రబాబు, రాజు, జగన్‌మోహన్ పర్యవేక్షించారు.

## హిందూపురం సీనియర్ సివిల్ జడ్జిగా హేమలత

**అనంతపురం (లీగల్), న్యూస్‌టుడే:** హిందూపురం సీనియర్ సివిల్ జడ్జిగా హేమలత నియమితులయ్యారు. ప్రస్తుతం హిందూపురంలో పనిచేస్తున్న వెంకటేశ్వరులు నాయక్ పదోన్నతిపై జిల్లా న్యాయమూర్తిగా వెళుతుండడంతో ఆ పోస్టు ఖాళీ ఏర్పడింది. హైకోర్టు బుధవారం సివిల్ న్యాయమూర్తుల (సీనియర్ డివిజన్) బదిలీలు చేపట్టింది. ఈక్రమంలో ప్రకాశం జిల్లా ఒంగోలులో పనిచేస్తున్న హేమలతను హిందూపురం సివిల్ కోర్టు(సీనియర్ డివిజన్)కు బదిలీ చేశారు.

## మంత్రి సంతకం ఫోర్జరీ కేసులో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

**కదిరి పట్టణం, న్యూస్‌టుడే:** రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాపీ తయారు చేసిన కేసులో ఇద్దరు నిందితులను బుధవారం తనకల్లు పోలీసులు అరెస్టు చేశారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపిన వివరాల మేరకు.. తనకల్లు మండలం చీకటిమానుపల్లికి చెందిన జయచంద్ర, కదిరి మండలం కౌలేపల్లి కాలనీకి చెందిన వేణు, గంగాద్రి బంధువులు. జయచంద్ర భార్య రమణమ్మ కడప రిమ్స్‌లో స్టాఫ్‌నర్సుగా పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. సొంతూరుకు వచ్చి వెళ్లేందుకు, పిల్లల బాగోగులు చూసుకోవడానికి ఇబ్బందిగా ఉందని ఆమెను ఇక్కడికి బదిలీ చేయించుకోవాలని జయచంద్ర తన బంధువైన గంగాద్రికి చెప్పారు. ఈ విషయమై గంగాద్రి ఆయన కుమారుడు వేణు చర్చించుకుని బదిలీ పేరుతో జయచంద్రను మోసగించి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. తమకు మంత్రి సత్యకుమార్ పీఏ శేషాద్రి తెలుసని, ఆయనతో మాట్లాడి రమణమ్మను బదిలీ చేయిస్తామని నమ్మించి జయచంద్ర నుంచి రూ.లక్ష తీసుకున్నారు. వేణు తన సెల్‌ఫోన్‌లో మంత్రి డిజిటల్ సంతకంతో రమణమ్మను మదనపల్లెకు బదిలీ చేసినట్లు నకిలీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాపీ తయారు చేసి జయచంద్రకు వాట్సప్ ద్వారా పంపారు. ఈ కాపీని దంపతులిద్దరూ మదనపల్లెలో అధికారులకు చూపగా నకిలీ కాపీగా తేల్చారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు ఈనెల 26న తనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం కౌలేపల్లి సమీపంలో ఉన్న గంగాద్రి, వేణును అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ నాగేంద్ర, ఎస్సై దిలీప్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

## ఇద్దరు గంజాయి విక్రేతల పట్టివేత

### 10.55 కిలోలు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** ఒడిసా రాష్ట్రానికి చెందిన ఇరువురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి పేర్కొన్నారు. తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రిలోని రైల్వేస్టేషన్ పరిసరాల్లో సీఐ ఆరోహనరావు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న సంచుల్లో పెద్దఎత్తున గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఒడిశాకు చెందిన బలరాం సైన్, 17 ఏళ్ల బాలుడి ఉన్నారు. వీరి వద్ద ఉన్న 10.55 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో ఒకరు బాలుడు ఉండటంతో తహసీల్దార్ సోమశేఖర్‌కు తెలియజేసి నిబంధనల ప్రకారం విచారణ జరిపినట్లు ఏఎస్పీ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి విక్రేతలను అరెస్టు చేసినందుకు ఏఎస్పీ పోలీసు సిబ్బందిని అభినందించారు.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెథినీ మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ కె.యస్.హెచ్.శాస్త్రి (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 89784 80704
వాహనము తనిఖీ కొరకు : 99204 59242

**ఇ-వేలం ద్వారా వాహనములు అమ్మకం (హైపోథికేషన్)**

ఈ దిగువ ఉదహరించిన ఋణగ్రహీత వాహనముల కొనుగోలు కొరకు ఋణసౌకర్యము వినియోగించుకున్నారు. ఋణగ్రహీత ఋణము యొక్క వాయిదాలు చెల్లించుటలో విఫలమైనారు. కావున బ్యాంకు వారిచే సదరు వాహనములు జప్తు చేయబడి ఆన్‌లైన్ వేలం ద్వారా వేలం వేయుటకు ఈ దిగువ తేదీన నిర్ణయించటమైనది.

ఋణగ్రహీత(ల) పేరు : శ్రీ కాశీపోగుల సురేష్, తండ్రి : రోశప్ప (లేటు), దిన్నమీదపల్లి, గొరికపల్లి, అనంతపురం, ఆంధ్రప్రదేశ్ - 515581.

| వ.సం. | రిజిస్ట్రేషన్ నెం. | కంపెనీ / ప్యూయల్ / కలర్ | మోడల్ | రిజర్వు ధర | ధరావత్తు |
|---|---|---|---|---|---|
| 1 | AP 39 UL 1310 | ASHOK LEYLAND / WHITE & GREEN / DIESEL / OMINI BUS | NOV - 2022 | Rs. 13,25,000/- | Rs. 1,32,500/- |

వాహనములు తనిఖీ చేయు ప్రదేశం: మెస్సర్స్ రాయలసీమ ఎంటర్‌ప్రైజెస్ (పార్కింగ్ యార్డు), కళ్యాణదుర్గం రోడ్డు, కూరుగుంట.
ఇ-వేలం తేది మరియు సమయం : 13-05-2026 ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 02.00 గం॥ల వరకు
బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం : 12-05-2026 సా॥ 04.00 గం॥లకు
బిడ్ పెంపుదల : బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ.10,000/-లతో గుణింపులో హెచ్చించవలెను.

నియమ నిబంధనలు : 1) వాహనములను "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" అను పద్దతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు వాహనములు అమ్మబడవు. 3) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 4) విజేత బిడ్డరు పేరుపై వాహనములు బదిలీ చేయుటకు సంబంధించి సంబంధిత అన్ని ఖర్చులు విజేత బిడ్డరు మాత్రమే భరించవలెను. తేదీ: 30-04-2026 నుండి తేదీ: 12-05-2026 వరకు బ్యాంకు పనివేళల యందు వాహనములు తనిఖీ చేసుకొనవచ్చును. 5) ట్యాక్స్ నిబంధనల ప్రకారం జిఎస్‌టి & టిసిఎస్ & ఇతర ఛార్జీలు వర్తిస్తాయి. 6) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 7) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్: www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance యొక్క వెబ్‌పోర్టల్: https://baanknet.com/eauction-psb/bidder-registration, టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 8291220220ను సంప్రదించండి.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కోనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

తేది : 29-04-2026, ప్రదేశం : విజయవాడ    సం/- అధీకృత అధికారి, SBI, SARB, విజయవాడ


## వడదెబ్బ లక్షణాలతో ముగ్గురి మృత్యువాత

మల్లయ్య

**ధర్మవరం, న్యూస్‌టుడే:** ధర్మవరం నియోజకవర్గంలో వేర్వేరు చోట్ల వడదెబ్బ లక్షణాలతో బుధవారం ముగ్గురు మృతిచెందారు. మండలంలోని కత్తేకొట్టాల గ్రామానికి చెందిన రైతు మల్లయ్య (38) పాడి పశువులను ఇంటి వద్ద నుంచి పశువుల పాకకు తోలుకెళ్లారు. దాంతోపాటు మధ్యాహ్నం ఎండలో పని చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. తోటి రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు బాధితున్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. ఆయనకు భార్య భారతి, కుమారుడు ఉన్నారు.

**ధర్మవరం:** పట్టణంలోని కొత్తపేట రైల్వేస్టేషన్ కూడలి వద్ద షాషా (51) అనే వెల్డింగ్ కార్మికుడు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం సమయంలో పని నిమిత్తం ఇంటి నుంచి వచ్చిన షాషా వడదెబ్బకు గురై మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

**కనగానపల్లి, బత్తలపల్లి:** మండలంలోని దంపెట్ల గ్రామానికి చెందిన కూలీ వీరనారప్ప (58) పొలంలో వేరుసెనగ తొలగించేందుకు కనగానపల్లికి వెళ్లారు. మధ్యాహ్నం పొలంలో కుప్పకూలి పడిపోయాడు. తోటి కూలీలు గమనించి వీరనారప్పను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

### హంద్రీనీవా కాలువలో పడి డిగ్రీ విద్యార్థి...

షమీర్

**సోమందేపల్లి, న్యూస్‌టుడే:** స్థానిక నక్కలగుట్ట సమీపంలో ప్రధాన రహదారి పక్కన హంద్రీనీవా కాలువ నీటిలో మునిగిపోయి డిగ్రీ విద్యార్థి షమీర్ (19) బుధవారం మృత్యువాత పడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్ ముకుందరావు తెలిపిన వివరాల మేరకు హిందూపురం హస్నాబాద్‌కు చెందిన సమీఉల్లా హస్నాబాను దంపతులతో పాటు ఇద్దరు కుమారులు, తమ సమీప బంధువులు కలిసి ఆటోలో సోమందేపల్లి హంద్రీనీవా కాలువ వద్దకు బుధవారం మధ్యాహ్నం చేరుకున్నారు. మహిళలు దుస్తులు శుభ్రం చేయగా..ఇరువురు కుమారులతో కలిసి తండ్రి కాలువలో ఈతకు దిగారు. వీరిలో ఈతరాని పెద్ద కుమారుడు షమీర్ ఒక్కసారిగా కాలువలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. భయంతో కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న పలువురు చేరుకొని ఆచూకీ కోసం గాలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక వాహనం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు సాయంత్రం విద్యార్థి మృతదేహాన్ని వెలికి తీశారు. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. డిగ్రీ చదువుతున్న కుమారుడు తమ కళ్లెదుటే విగతజీవిగా మారడాన్ని తట్టుకోలేక బోరున విలపించారు. శవపరీక్ష కోసం మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## లారీని ఢీకొని చోదకుడి దుర్మరణం

**రాప్తాడు, న్యూస్‌టుడే:** జాతీయ రహదారి 44పై బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న లారీ అదుపుతప్పి ముందున్న లారీని ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందినట్లు రాప్తాడు పోలీసులు తెలిపారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి (32) మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో గ్రానైట్ లోడ్ వేసుకొని బెంగళూరు వైపు బయలుదేరారు. అనంత జిల్లా రాప్తాడు ఎస్వీఐటీ సమీపంలోని జాతీయ రహదారిపైకి చేరుతుండగా, ఆకస్మాత్తుగా వాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న సిమెంటు లోడు లారీని వెనుక నుంచి ఢీకొంది. లారీ ముందు భాగం నుజ్జునుజ్జవడంతో భాస్కర్‌రెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రైలు ఢీకొని కార్మికుడు...

**అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే:** కల్లూరు రైల్వేస్టేషన్ యార్డులో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. వివరాలు.. కల్లూరు ఆర్ఎస్‌కు చెందిన మహబూబ్ బాషా(48) హోటల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన తాగుడుకు బానిసగా మారడంతో భార్య తన పిల్లలను తీసుకెళ్లి దూరంగా ఉంటున్నారు. ఇటీవల బాషా తల్లిదండ్రులు మరణించడంతో ఒంటరి అయ్యాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి కల్లూరులో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో మృతుడి భార్య హసీనా ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి భర్త మహబూబ్‌బాషాగా గుర్తించింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu